క్లుప్తంగా

కమిషనర్‌కు సన్మానం



జాదవ్ కృష్ణను సన్మానిస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి పొందిన, బల్దియా రెవెన్యూ అధికారి జాదవ్ కృష్ణ, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికైన కాండ్లీ శివకుమార్, రామారావు రాథోడ్‌లను సోమవారం టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. స్థానిక సంఘ భవనంలో జరిగిన కార్యక్రమంలో వారిని శాలువాలతో సత్కరించారు. టీఎన్జీవోస్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.అశోక్, ఎ.నవీన్ కుమార్, అసోసియేట్ అధ్యక్షులు గుజరాత్ గోపి, రాజేశ్వర్, రాంమోహన్, శ్రీనివాస్, తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు ప్రవీణ్, అరుణ్, కలీం, నర్సింలు, సంజయ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడికి..



కొత్త కార్యవర్గాన్ని సన్మానిస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం నూతన కార్యవర్గ ప్రతినిధులను ఆఫీసర్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆఫీసర్ క్లబ్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కె.శివకుమార్‌తో పాటు జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ రజినీకాంత్ రెడ్డి, జిల్లా గేమ్స్ అండ్ స్పోర్ట్స్ సెక్రెటరీ శ్రీనివాస్ రెడ్డిలను పూలమాల, శాలువాలతో సత్కరించి అభినందించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ దామోదర్ రెడ్డి, క్లబ్ సెక్రెటరీ లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రవీణ్ రెడ్డి, జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం మాజీ సెక్రెటరీ రాజేందర్ దేశ్‌పాండే, విఠల్, అచ్యుత్ రెడ్డి, అమిత్ రెడ్డి, రామిరెడ్డి, మసూద్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.


గిరిజన కళాకారుడికి..



కళాకారుడిని సన్మానిస్తున్న అధ్యాపకులు

ఉట్నూర్‌రూరల్: న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో కల్చరల్ సెంటర్‌లో గిరిజన కళాకారుల చిత్రకళ ప్రదర్శనలో పాల్గొన్న ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ గిరిజన విద్యార్థి మడావి ఆనంద్‌రావ్‌ను సోమవారం స్థానిక డిగ్రీ కళాశాలలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు సన్మానించారు. ప్రిన్సిపాల్ ప్రతాప్‌సింగ్, అధ్యాపకులు సాయిప్రసాద్, నర్సింగ్‌రావు, రాజశేఖర్, శ్రీకాంత్, కరుణాకర్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

'భారత రాజ్యాంగం'పై వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న భీంఆర్మీ నాయకులు

ఇంద్రవెల్లి: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో భీం ఆర్మీ ఆధ్వర్యంలో ఈ నెల 26న నిర్వహించే భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మండలకేంద్రంతో పాటు మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులు 150 మంది హాజరయ్యారు. ఖానాపూర్ నియోజకవర్గం భీం ఆర్మీ అధ్యక్షుడు పరత్‌వాగ్ సందీప్, అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్, దళిత సంఘాల నాయకులు ఉత్తం, రాజేందర్, అతీష్ తదితరులు ఉన్నారు.

పోలీస్ శిక్షణ పూర్తిచేసుకున్న యువకులకు సన్మానం



సన్మానిస్తున్న ఆదివాసీ నాయకులు

నార్నూర్: పోలీస్ ఉద్యోగం సాధించి శిక్షణ పూర్తి చేసుకున్న గాదిగూడ మండలంలోని అర్జుని గ్రామానికి చెందిన అగర్భాషావ్ -రుపాబాయి దంపతుల కుమారుడు ఆత్రం అరవింద్, రాంపూర్ గ్రామానికి చెందిన హెచ్‌కే రామారావు -గంగుబాయి దంపతుల కుమారుడు జగదీశ్‌లను సోమవారం తుడుందెబ్బ, ఆదివాసీ గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పెందూర్ దాదిరావు, ఆదివాసీ గిరిజన విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెందూరు సంతోష్, మండల ఉపాధ్యక్షుడు మధు, కార్యదర్శి గంగారాం, ప్రచార కార్యదర్శి శ్రీరామ్ తదితరులు ఉన్నారు.

పంటల రక్షణకు సోలార్ కంచె



అడవి పందుల దాడిలో ధ్వంసమైన పంట (ఫైల్)

- తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం
- తగ్గిన వన్యప్రాణుల బెడద
- ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వాలని కోరుతున్న అన్నదాతలు

తాంసి: పగలు, రాత్రి అనే తేడా లేకుండా అడవి జంతువుల బారి నుంచి పంటలను కాపాడుకోవడం రైతులకు కష్టంగా మారింది. అడవి జంతువుల నుంచి పంటలను కాపాడుకోవడం కోసం సోలార్ కంచెలు ఏర్పాటు చేసుకుంటున్నారు. విద్యుత్ కంచెల నుంచి ప్రమాదాలు పొంచి ఉండడంతో రైతులు సోలార్ కంచెలు ఏర్పాటు చేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. సోలార్ కంచెల ద్వారా ఎలాంటి ప్రాణాపాయం లేకపోవడంతో వీటి ఏర్పాటుకు ముందుకు వస్తున్నారు.

పంటలు ధ్వంసం..

తాంసి, భీంపూర్ మండలాల్లోని సాగు భూములు అటవీ ప్రాంతానికి సమీపంలో అధికంగా ఉన్నాయి. దీంతో అడవిపందులు, మనుబోతుల బెడద ఎక్కువగా ఉంటుంది. పత్తి, కంది, శనగ, జొన్న, సోయా పంటలను దిగుబడి వచ్చే సమయంలో జంతువులు దాడి చేసి ధ్వంసం చేస్తున్నాయి. భీంపూర్ మండలంలోని పెన్‌గంగ పరీవాహక ప్రాంతాల్లో ఉన్న పంట చేలో సైతం అడవిజంతువుల బెడద సైతం ఎక్కువగా ఉంది. వడూర్, గుబిడి, అంతర్గాం, ధనోర, గోన, గోముత్రి, కరంజి(టి), కరన్‌వాడీ, అర్లి, భీంపూర్, తాంసి(కె), గొల్లఘాట్ గ్రామాల శివారులో ఎక్కువగా అడవి పందుల బెడద ఉంది. వీటి నుంచి పంటలను కాపాడుకునేందుకు రైతులు సోలార్ కంచెలు ఏర్పాటు చేసుకుంటున్నారు.



సోలార్ ఫెన్సింగ్‌ను చూపుతున్న రైతు

10 ఎకరాలకు రూ.14వేల ఖర్చు..

సోలార్ కంచె ద్వారా ఎలాంటి ప్రాణహాని ఉండదు. సోలార్ మిషన్ ద్వారా వైర్ నుంచి వచ్చే షాక్‌కి భయపడి అడవి జంతువులు పారిపోతాయి. 8 నుంచి 10 ఎకరాల వరకు సోలార్ కంచె ఏర్పాటు చేసుకునేందుకు రూ.9 వేల నుంచి రూ.14వేల ఖర్చు వస్తుంది. ఒకసారి సోలార్ ఏర్పాటు చేసుకొని పంటలు సాగుచేసే సమయంలో సరిగ్గా వినియోగిస్తే ఏళ్ల తరబడి వరకు పని చేస్తుందని రైతులు చెబుతున్నారు. ఎకరాలను బట్టి తక్కువ ఖర్చుతో సైతం ఏర్పాటు చేసుకునే వీలుందని రైతులు అంటున్నారు. సోలార్ కంచె ఏర్పాటుకు ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

రూ.10వేలు ఖర్చు చేశాను



పంటచేను చుట్టూ సోలార్ కంచె ఏర్పాటుకు 7 ఎకరాల కోసం రూ.10వేలు ఖర్చు చేశాను. సోలార్ ఏర్పాటుకు ముందు శనగతో పాటు జొన్నపంట దిగుబడి సమయంలో అడవి జంతువులు దాడి చేసి పంటను దెబ్బతీసేవి. సోలార్ కంచె ఏర్పాటుతో అడవి జంతువుల బెడద తగ్గింది.

– హరీశ్‌రెడ్డి, రైతు, జామిడి

పంటలను కాపాడుకోవచ్చు



సోలార్ కంచె పంట చుట్టూ ఏర్పాటు చేసి పంటలను సులువుగా రక్షించుకోవచ్చు. జంతువులకు, రైతులకు ఎలాంటి ప్రాణహాని జరగదు. ఇప్పటికే గ్రామాల్లో రైతులు స్వయంగా సోలార్ కంచె ఏర్పాటు చేసి పంటలను సాగు చేస్తున్నారు.

– రవీందర్, మండల వ్యవసాయాధికారి

నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఉట్నూర్‌రూరల్: అభివృద్ధి నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. సోమవారం ఉట్నూర్ మండలంలోని సుద్దగూడ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న వంతెన పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల విషయంలో నాణ్యత ప్రమాణాలు లోపించకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టాలని ఆదేశించారు.

'తుకారాం వర్ధంతి సభను జయప్రదం చేయండి'

ఈనెల 29న ఉట్నూర్ మండలంలోని లక్సెట్టిపేట గ్రామంలో తొలి ఆదివాసీ ఐఏఎస్ మడావి తుకారాం 26వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో వర్ధంతి సభ పోస్టర్లను ఆవిష్కరించారు. సభ నిర్వాహణ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

మాలల సింహగర్జనకు రావాలని ఆహ్వానం..

డిసెంబర్ 1న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో మాలల ఆధ్వర్యంలో తలపెట్టిన మాలల సింహగర్జన భారీ బహిరంగ సభకు రావాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు ఉట్నూర్ క్యాంప్ కార్యాలయంలో నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండల మాల సంఘ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. అనంతరం అంబేద్కర్ చిత్రపటాన్ని ఆయనకు బహూకరించారు.

రిమ్స్‌లో ఫ్లెక్సీ గొడవ



ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేస్తున్న సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లోని ఎమర్జెన్సీ వార్డు ముందు గల షెడ్‌లో ఏర్పాటు చేసిన నారాయణ బాబా ఫ్లెక్సీని ఓ ఫౌండేషన్ సభ్యులు చించివేయడంతో గందరగోళం నెలకొంది. విషయం తెలుసుకున్న నారాయణ బాబా భక్తమండలి సభ్యులు సోమవారం ఉదయం అక్కడికి చేరుకొని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌లకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బాధితుడికి కాంగ్రెస్ నాయకుల పరామర్శ



పరామర్శిస్తున్న శ్రీకాంత్ రెడ్డి, ఆత్రం సుగుణ

ఆదిలాబాద్‌టౌన్: పాముకాటుకు గురై జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో చికిత్స పొందుతున్న సిరికొండ మండలం రాజంపేటకు చెందిన బండు పటేల్‌ను కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, కిసాన్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డిలు పరామర్శించారు.

పేదలకు విద్య, వైద్యం ఉచితంగా అందించాలి

కైలాస్‌నగర్: ప్రభుత్వాలు మారుతున్నాయే తప్పా సామాన్య ప్రజల జీవన స్థితిగతుల్లో మాత్రం ఎలాంటి మార్పు రావడం లేదని ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేశ్ మహరాజ్ ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేదలకు విద్య, వైద్యం ఉచితంగా అందించడంతో పాటు వ్యవసాయ భూమి, ఇంటిని నిర్మించి ఇవ్వాలనే డిమాండ్లతో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పేదల పక్షాన ధర్మసమాజ్ పార్టీ అండగా ఉంటూ ఉద్యమిస్తుందని తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్, జిల్లా నాయకులు వెంకటేశ్, సంతోష్, గణేశ్, నవీన్, వినోద్, రమేశ్, రాజేశ్వర్, సాయి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న డీఎస్‌పీ నాయకులు

సంక్షిప్త వార్తలు

నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో చలితీవ్రత పెరుగుతుండడంతో యాచకులు, నిరాశ్రయులకు వరాహి హెల్పింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. రైల్వే స్టేషన్, బస్టాండ్, ఫుట్‌పాత్‌లపై ఉండేవారికి దుప్పట్లు అందజేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు బండి ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి రామగిరి శిరీష్, నిరంజన్, సాయిప్రసాద్, మహేష్, నిఖిల్, కృష్ణ, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

సోయా కొనుగోళ్లు బంద్

నేరడిగొండ: మార్కెట్‌లో సోయాబీన్ నిల్వలు పెరిగిపోవడంతో మండల కేంద్రంలో మంగళ, బుధవారాల్లో కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు పీఏ సీఎస్ ఇన్‌చార్జి బారె నాగభూషణం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం నుంచి యథావిధిగా కొనుగోళ్లు ప్రారంభిస్తామన్నారు. విషయాన్ని రైతులు గమనించి సహకరించాలని కోరారు.

నేడు భూమిపూజ

నేరడిగొండ: భారత నియోజకవర్గాల ఏర్పాటు సందర్భంగా మండలంలోని రాజురా గ్రామంలో మంగళవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ భవనాలకు భూమిపూజ చేయనున్నట్లు ఎంపీడీవో రాజ్‌వీర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు భవన నిర్మాణాలకు భూమిపూజ చేయనున్నందున మండల స్థాయి అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

పోస్టర్ ఆవిష్కరణ

నేరడిగొండ: సీఐటీయూ జిల్లా కార్యాలయ ప్రారంభోత్సవ సభను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కిరణ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సీఐటీయూ జిల్లా కార్యాలయ ప్రారంభోత్సవ బహిరంగ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 28న సీఐటీయూ జిల్లా కార్యాలయం బాషెట్టి మాధవరావు విజ్ఞాన కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. సీఐటీయూ నేరడిగొండ మండల అధ్యక్షులు లక్ష్మణ్, హమ్మద్, భీమేష్, సతీష్, చిన్నయ్య, జాదవ్ అర్జున్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శైలజ మృతికి కారకులను శిక్షించాలి

ఎదులాపురం: ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల ఆశ్రమ విద్యార్థిని మృతికి కారకులైన పాఠశాల హెచ్‌ఎం, వార్డెన్, డీటీడీవోలను కఠినంగా శిక్షించాలని ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూసం సచిన్ డిమాండ్ చేశారు. విద్యార్థికి సరైన వైద్యం అందించలేదని ఐటీడీఏ పీవోను తొలగించాలని, తెలంగాణ ప్రభుత్వం శైలజ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

బోథ్: మండలంలోని మర్లపెల్లి గ్రామానికి చెందిన సంజీవ్ అనే లబ్ధిదారుడికి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడ గజేందర్ రూ.42 వేలు విలువ గల చెక్కును సోమవారం అందజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ కోసం నేరడిగొండలోని క్యాంపు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో చదవాలి

బోథ్: విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో చదవాలని పోటీ పరీక్షల నిపుణులు రమణ గౌడ్, అల్లం సాయికృష్ణలు అన్నారు. సోమవారం మండలంలోని ధన్నూర్ బి గ్రామంలో జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు రాజు, ఉపాధ్యాయులు రావుల శంకర్, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి చంటి, షేక్ అలీ తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయండి

బోథ్: బోథ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని సీపీఐ నాయకులు సోమవారం ఎంపీడీవో రమేశ్‌కు వినతిపత్రం అందించారు. లైటింగ్ లేకపోవడంతో కొంతమంది మద్యం సేవిస్తూ మద్యం సీసాలను పగలగొడుతున్నారన్నారు. మైదానంలో మొరం వేయించాలని కోరారు. సీపీఐ పట్టణ అధ్యక్షుడు నరేశ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పిప్పల్‌కోటిలో లైబ్రరీ ప్రారంభం

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి ప్రాథమిక పాఠశాలలో సోమవారం లైబ్రరీని ఎంఈవో శ్యాంసుందర్ ప్రారంభించారు. రూమ్ టు రీడ్‌లో భాగంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఉపాధ్యాయులతో కలిసి ఆయన పరిశీలించి పుస్తకాలను ప్రదర్శించారు. ప్రతీ మండలానికి ఒక్కటి చొప్పున మోడల్ లైబ్రరీని ఏర్పాటు చేస్తున్నట్లు ఎంఈవో తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం విలాస్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ రమ, మాజీ సర్పంచ్ కళ్యాణి, రూమ్ టు రీడ్ సభ్యులు మహేందర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

'దాతల సహకారం అభినందనీయం'

తలమడుగు: పాఠశాల అభివృద్ధికి దాతలు ముందుకొచ్చి సహకారం అందించడం అభినందనీయమని హెచ్‌ఎం వెంకట్‌రావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో మండల కేంద్రానికి చెందిన కాటిపల్లి ఆనంద్ రెడ్డి, డాక్టర్ సంజీవరావులు ఒక్కొక్కరు రూ.5000లు చొప్పున పాఠశాలకు అందించారు. ఉపాధ్యాయులు వినోద్ రెడ్డి, మురళీధర్ ఉన్నారు.

'మహిళల భద్రత అందరి బాధ్యత'

ఆదిలాబాద్‌టౌన్: మహిళల భద్రత అందరి బాధ్యత అని సఖీ కేంద్రం సైకో సోషల్ కౌన్సిలర్ లావణ్య అన్నారు. స్త్రీలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా అంతర్జాతీయ దినోత్సవంలో భాగంగా ఈనెల 25 నుంచి డిసెంబర్ 10 వరకు మానవ హక్కుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని విద్యానగర్ శ్రీ శిరిడిసాయి సేవా సొసైటీ సౌజన్యంతో కొనసాగుతున్న వృత్తి విద్య నైపుణ్య శిక్షణ కేంద్రం, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సఖీ కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. లీగల్ కౌన్సిలర్ సంఘమిత్ర, కేసువర్కర్ ప్రవీణ, మల్టీపర్పస్ సునీత, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సంగీత, టైలరింగ్ ట్రెనింగ్ సెంటర్ ట్రైనర్ అన్వరి, లెక్చరర్లు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న లావణ్య

ఘనంగా మహిళలపై హింస వ్యతిరేక దినోత్సవం

నార్నూర్: గాదిగూడ మండల కేంద్రంలోని కేజీబీవీలో సఖి కేంద్రం, మహిళ సాధికారత కేంద్రం వారి ఆధ్వర్యంలో సోమవారం మహిళలపై హింస వ్యతిరేక దినోత్సవం జరుపుకున్నారు. జిల్లా మిషన్ కోఆర్డినేటర్ యశోద మాట్లాడుతూ సమాజంలో మహిళలపై జరుగుతున్న అన్యాయాన్ని సమష్టిగా పోరాటం చేసి రూపుమాపాలన్నారు. సఖి కేంద్రం నిర్వాహకురాలు సరస్వతి, కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'ఏజెన్సీ చట్టాల అమలు బాధ్యత అధికారులదే'

ఇచ్చోడ: ఏజెన్సీ ప్రాంత చట్టాలను అమలు చేసే బాధ్యత జిల్లా అధికారులపై ఉందని తుడుందెబ్బ నాయకులు కొడప నగేశ్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఆదివాసీ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇచ్చోడలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ఇచ్చోడ సమస్యలను పరిష్కరించేందుకు ఆదివాసీ సంఘాలు ఈ నెల 30 వరకు ఇచ్చిన గడువును తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. ఇచ్చోడలో 1969 నుంచి స్థిరనివాసం ఉంటున్న గిరిజనేతరులకు తాము వ్యతిరేకం కాదన్నారు. తుడుం దెబ్బ నాయకులు ఆత్రం మహేందర్, మెస్రం శంభు, సంగేపు రమేశ్, మెస్రం ఆనంద్‌రావు, కాత్లే విఠల్, పెందూర్ శంకర్, గేడంనీలు, నైతం మాధవ్, మెస్రం నాగోరావు, కుమ్ర జ్యోతిరాం, పెందూర్ రమేశ్ పాల్గొన్నారు.



ఇచ్చోడలో మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

'గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచండి'

బోథ్: బోథ్ వ్యవసాయ మార్కెట్‌ను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. గన్నీ బ్యాగుల సమస్య ఉందని రైతులు చెప్పడంతో వెంటనే మార్క్‌ఫెడ్ డీఎంకు ఫోన్ చేసిన ఆయన, ప్రతీ మార్కెట్‌యార్డులో గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలన్నారు. ఏఎంసీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, ప్యాక్స్ డైరెక్టర్లు రాజు యాదవ్, ఉమేశ్, మహేందర్, షేక్, రమేశ్, అజీమ్, రాజు, మహమ్మద్, అబ్రార్, అబుద్, నారాయణ, పోతన్న, భోజన్న, సాయన్న, ఆసిఫ్, వంశీ పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఆడే గజేందర్

ప్రజాపాలన విజయోత్సవాల కళాజాత

ఉట్నూర్‌రూరల్: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీఆర్వో ఆధ్వర్యంలో సోమవారం ఉట్నూర్ మండలంలోని నాగాపూర్, శ్యాంపూర్, ఎక్స్‌రోడ్డు గ్రామాల్లో ప్రజాపాలన విజయోత్సవాల కళాజాత నిర్వహించారు. కళాకారులు ఆటపాటల ద్వారా ప్రభుత్వ పథకాలు, 6 గ్యారంటీలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాజాత సమన్వయ కర్త, తెలంగాణ సాంస్కృతిక సారథి ఆత్రం గోవింద్ రావు, రాథోడ్ శంకర్, గోడం ఆశిశ్, కుమ్ర నగేశ్, ఈవో శంకర్, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



గ్రామాల్లో కళాజాత ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

బోథ్ ఎమ్మెల్యే పరామర్శ

ఆదిలాబాద్‌టౌన్: అనారోగ్యంతో బాధపడుతూ రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బోథ్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురిని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ కుమార్ పరామర్శించారు. వారి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. వారికి మెరుగైన వైద్యమందించాలని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌ను కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

బేల: మండలంలోని సాంగ్వి(జి) గ్రామానికి చెందిన తుడుందెబ్బ ప్రధాన కార్యదర్శి ఉయిక సంజీవ్ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. సోమవారం బాధిత కుటుంబాన్ని రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి పరామర్శించారు. ఆమె వెంట ఐటీడీఏ(పీవీటీజీ) ఏపీవో మేస్రం మనోహర్, లక్కారం మాజీ సర్పంచ్ మర్సుకోల తిరుపతి తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన సుగుణ..

మండలంలోని సాంగ్వి(జి) గ్రామంలో ఉయిక సంజీవ్ కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగణ, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డిలు పరామర్శించారు. నాయకులు నవీన్‌రెడ్డి, విశాల్ తదితరులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

నేరడిగొండ: పరిసరాల పరిశుభ్రత పాటిస్తేనే ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని హెచ్‌ఈవో పవార్ రవీందర్ అన్నారు. సోమవారం మండలంలోని వాంకిడి, లింగట్ల, గోండుగూడ గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారాన్ని వేయొద్దన్నారు. నీరు నిల్వ ఉన్న చోట దోమలు వృద్ధి చెంది వ్యాధులకు కారణమవుతాయని పేర్కొన్నారు. ఆయ న వెంట హెల్త్ అసిస్టెంట్ నర్సయ్య, సీహెచ్‌వో భీంరాజ్, ఆశలు శ్రీలత, పెందూర్ గంగామణి, అంగన్‌వాడీలు ఉన్నారు.



వైద్యశిబిరం నిర్వహిస్తున్న పవార్ రవీందర్

శతాధిక వృద్ధుడి జన్మదిన వేడుకలు

ఇంద్రవెల్లి: మండల కేంద్రానికి చెందిన వృద్ధుడు మోహన్‌లాల్ జైస్వాల్ సోమవారం 100 సంవత్సరాలు పూర్తి చేసుకుని 101వ సంత్సరంలోకి అడుగుపెడుతున్న వేళ జన్మదిన వేడుకలను కుటుంబ స భ్యులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి మి ఠాయిలు తినిపించారు. బంధు మిత్రులు, ప్రముఖ వ్యాపారస్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



మోహన్‌లాల్ జన్మదిన వేడుకల్లో బంధువులు

అన్నదానం

ఆదిలాబాద్‌టౌన్: న్యూ రెయిన్‌బో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని ఆయా ప్రాంతాల్లో ఉన్న నిరాశ్రయులు, యాచకులు, ది వ్యాంగులు, వృద్ధులకు ఆహార పొట్లాలు అందజేశారు.